క్లుప్తంగా

రైతులందరికీ రైతుబంధు ఇవ్వాలి

కోస్గి: ప్రభుత్వం రైతులందరికీ రైతుబంధు నిధులు అందజేయాలని టీపీసీసీ సభ్యుడు వార్ల విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో రైతులందరికీ రైతుబంధు అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం దశలవారీగా నిబంధనలు అమలు చేస్తూ రైతుబంధు ఇవ్వడం లేదన్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌కు సంబంధించి కేవలం 5 ఎకరాలలోపు మాత్రమే పెట్టుబడి సాయం అందించారన్నారు. 5ఎకరాలపై భూములున్న రైతులకు నేటికి పెట్టుబడి సాయం అందించకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే రైతులందరికీ పెట్టుబడి సాయం అందజేయాలన్నారు.

ఓపెన్ స్కూల్‌లో అడ్మిషన్లు ప్రారంభం

కోస్గి: తెలంగాణ ఓపెన్‌స్కూల్ సొసైటీ ద్వారా దూరవిద్యా విధానంలో పదోతరగతి, ఇంటర్‌లో చేరేందుకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని హకీంపేట జెడ్పీ ఉన్నతపాఠశాల అధ్యయన కేంద్ర ఇంచార్జి కో–ఆర్డినేటర్ రాములు, హెచ్ఎం మల్లికార్జున్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10నుంచి కొత్త అడ్మిషన్లప్రక్రియ ప్రారంభమైందని, ఆసక్తి ఉన్న అర్హులైన విద్యార్థిని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు హకీంపేట జెడ్పీఉన్నత పాఠశాల అధ్యాయన కేంద్రం లోగాని, 7207092435 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ప్లాస్టిక్ నివారణకు సహకరించాలి

మరికల్: ప్లాస్టిక్ నివారణకు వ్యాపారులు సహకరించాలని సర్పంచ్ గోవర్ధన్, కార్యదర్శి శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం పంచాతీ ఆవరణలో వ్యాపారులతో సమావేశం ఏర్పాటుచేశారు. ముఖ్యంగా కిరాణ, టి స్టాల్‌లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు వాడకం పూర్తిగా నివారించినట్లు తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్యం రోజు, రోజుకు సమస్యగా మారుతుందన్నారు. ఎవరైనా ప్లాస్టిక్ వాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఇథనాల్ కంపెనీని రద్దు చేయాలి




మరికల్: చిత్తనూర్ ఇథనాల్ కంపెనీని రద్దుచేయాలని మండలంలో చేపట్టిన రిలే నిరహార దీక్షలు ఆదివారంతో 23వ రోజుకు చేరుకుంది. గ్రామాల మధ్యన హానికరమైన కంపెనీని నిర్మించడం సరైంది కాదాన్నారు. కంపెనీని ఎత్తేసే వరకు తమపోరాటం ఆగదని నినాదాలు చేశారు. కంపెనీతో జరిగే నష్టాలపై ఎమ్మెల్యేలు స్పందించి రద్దుకు సహకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహదేవ్, లక్ష్మయ్య, ఆంజనేయులు, వెంకటమ్మ, మధుమతి, రాములమ్మ పాల్గొన్నారు.

ఘనంగా పండుగ సాయన్న జయంతి



మక్తల్: మండల పరిధిలోని పండుగసాయన్న జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలో ముదిరాజ్ భవనం నుంచి భారీర్యాలీగా వచ్చి రోడ్డుసమీపంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా మత్స్యకార సంఘం చైర్మన్ కోళ్ల వెంకటేష్ మాట్లాడుతూ.. పండుగసాయన్న ఆశయసాధన కోసం అందరూ కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వాకిటి అంజయ్య, శ్రీహరి, శేఖర్, పృద్వీరాజ్, తిరుపతి, వెంకటేష్, లక్ష్మన్, శ్యామ్, శివకుమార్, కావలి వెంకటేష్, తాయప్ప, డాక్టర్ శ్రీరామ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె



మద్దూరు: పంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శులు గోపాల్, అంజిలయ్య డిమాండ్ చేశారు. ఆదివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టినా సమ్మె శిబిరంలో కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 18రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం వీరితో చర్చలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా కార్మికులు న్యాయమైన సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెంకటప్ప, కార్మికులు అంజి, భీమప్ప, మొగులప్ప, రాములు పాల్గొన్నారు.

వర్షాకాలం.. జర పైలం

- ఆందోళన చెందవద్దు
- పాముకాటుకు గురైతే వైద్యులను ఆశ్రయించాలి
- ప్రభుత్వ ఆస్పత్రిలో అందుబాటులో మందులు



మాగనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మాగనూర్: వర్షాలతోపాటే పాములు వస్తుంటాయి. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు పాములు ఇతర విషకీటకాల బెడద అధికంగా ఉంటోంది. ధాన్యపు గాదెలు గడ్డివాములు, మొదలైనవి ఉండే చోట ఎలుకలు తిరుగుతుంటాయి. తడిగా ఉండే చోట కప్పలు చేరుతాయి. వాటిని తినడానికి పాములు వస్తుంటాయి. కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. గ్రామాల్లో చాలా చోట్ల ప్రజలు ఇంటి ఆరుబయట పడుకుంటారు. అలాంటప్పుడు పాములు వచ్చే అవకాశం ఉంది. కొన్ని జంతువులు పాములను చూసి ఆరుస్తాయి. అలాంటప్పుడు వెంటనే అలర్ట్ కావాలి. వానాకాలం సీజన్‌లో గ్రామీణ ప్రాంతాల్లో చాలామంది పాముకాటుకు గురై మరణిస్తుంటారు.

పాము కాటుకు ప్రథమ చికిత్స..

పాముకాటు వేయగానే అది విషపూరితమైన పామా లేక, మామూలు పామా అన్నది ముందుగా గుర్తించాలి. విషపూరితమైన పాము కాటు వేసినప్పుడు విషం కరిచిన చోటునుంచి రక్తం ద్వారా శరీరంలోకి వెళ్తుంది. అక్కడి నుంచి గుండెకు, అన్నిశరీర భాగాలకు వెళ్తుంది. విషం అన్ని శరీరభాగాలకు చేరుకోవడానికిమూడు గంటల సమయం పడుతోంది. ఈ సమయంలోనే చికిత్సను అందించకపోతే మృత్యువాత పడే అవకాశం ఉంది. పాము కాటుకు చికిత్స చేయడానికి అవసరమైన మందులు జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉన్నాయి.

భయాందోళన చెందొద్దు..

పాముకాటుకు గురైన వారు ఎట్టి పరిస్థితుల్లో ఆందోళన చెందొద్దు. ఆందోళన చెందితే గుండె పోటుకు గురయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రాథమిక చర్యగా కాటు వేసిన భాగంలో కట్టు కట్టాలి. పాముకాటుకు గురైనవారు మూఢనమ్మకాల జోలికి వెళ్లవద్దు. కొందరు పాము కరవగానే కొన్ని రకాల ఆకు రసాలను పిండి పోస్తారు. అది మంచికాదు. ఇలా చేస్తే ప్రాణాలకే ముప్పు ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

అవగాహన లేక..



గ్రామాల్లో నేటికి పాము కాటువేస్తే నాటువైద్యం లేదా మంత్రాలవైపునకు మొగ్గుచూపడటం ప్రజలకు అలవాటుగా మారింది. చివరికి సమయం దాటాక ఆస్పత్రికి తీసుకువెళ్తుండటంతో ప్రాణాలు కాపాడుకోలేకపోతున్నారు. వైద్యసిబ్బంది ప్రత్యేక దృష్టిసారించి గ్రామాల్లో అవగాహన నిర్వహించాలి.

– జమీల్ అహ్మద్, నేరడగం గ్రామస్తుడు

అప్రమత్తంగా ఉండాలి..



పాముకాటుకు గురైన వారు ఎలాంటి భయాందోళనకు గురికావొద్దు. పాముకాటుకు మందులు మగనూరు పీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నవి. పాముకాటుకు గురైన వారు ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ప్రాణాలకే ముప్పు ఉంటుంది. వెంటనే వైద్యులను ఆశ్రయించి చికిత్స పొందాలి. నాటు వైద్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలి.

– వెంకటరమణ, మండల వైద్యాధికారి, మాగనూర్

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయులు

నారాయణపేట రూరల్: కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ 57ప్రకారం పాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయాలని ఆ సంఘం ఉమ్మడి జిల్లా నాయకులు మహమూద్ కోరారు. జిల్లాలోని బాధితులు ఆదివారం హైదరాబాద్‌లో విద్యాశాఖ మంత్రి సబిత ఇంద్రారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2004 సెప్టెంబర్ 1కంటే ముందు నియమితులైన వారిని సీపీఎస్ నుంచి తప్పించాలని, పాత పెన్షన్ స్కీంలోకి చేర్చాలని విజ్ఞప్తి చేశారు. గతంలో ఆర్థికశాఖ ఇచ్చిన ఉత్తర్వుల మేరకు డీఈఓల నుంచి వివరాలు తీసుకోవాలని, ఆగస్టు 31లోపు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో శివశంకర్, నరేందర్, శివరాములు, మహేష్‌సాగర్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

మాగనూర్: అక్రమంగా తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పట్టుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. మాగనూర్‌కుచెందిన శాంతి అనే వ్యక్తి రేషన్‌బియ్యాన్ని జమచేసుకొని కర్ణాటకు తరలిస్తున్న సమయంలో బొలెరో వాహనాన్ని పట్టుకున్నారు. తరలిస్తున్న రేషన్‌బియ్యాన్ని పోలీస్‌సిబ్బంది కృష్ణప్రసాద్, సాయికుమార్ పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రేషన్ బియ్యంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల పంచనామ చేసిన అనంతరం కేసునమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

ఘనంగా చంద్రశేఖర్ ఆజాద్ జయంతి



నారాయణపేటలో తపస్ ఆధ్వర్యంలో నివాళి



ఊట్కూరులో విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : చిన్నతనం నుంచే విద్యార్థుల్లో దేశభక్తిని నూరిపోయాలని తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో ఆ సంఘం ఆధ్వర్యంలో చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంకోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల జీవిత విశేషాలను ఉపాధ్యాయులు ప్రత్యేకంగా తెలియచెప్పాలన్నారు. భవిష్యత్ తరాలకు అందించడానికి పాఠ్యపుస్తకాల్లో నిక్షిప్తం చేయడం ఎంతో అవసరమన్నారు. అనంతరం ఆజాద్ చేసిన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ నర్సింహ, గురునాథ్‌రెడ్డి, నర్సింగప్ప, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి, విజయ్‌రెడ్డి, రాకేష్, శ్రీధర్, శంకర్, వెంకట్‌రెడ్డి, కరుణ, బాలమురళి, శ్రీనివాస్, వెంకట్రాములు పాల్గొన్నారు.

మండలంలోని కోటకొండలో తిలక్ వేడుకలను గ్రామ వీహెచ్‌పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ చౌరస్తాలో బాలగంగాధర్ తిలక్ చిత్రపటానికి పూజలుచేసి నివాళులర్పించారు. హిందువులను ఒక్కతాటిపైకి తెచ్చిన ఘనత ఆయనదని అన్నారు. కార్యక్రమంలో జనార్దన్, రాములు, సాయిలు, వెంకటేష్, చెన్నప్ప, రవి, రామకృష్ణ, మల్లేష్ పాల్గొన్నారు.

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో పీవైఎల్, పీడీఎస్‌యూ, సీపీఐఎంఎల్ ప్రజాపంథ ఆధ్వర్యంలో ఆదివారం చంద్రశేఖర్ ఆజాద్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సంతబజార్‌లో ఏర్పాటుచేసిన చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్ధు మాట్లాడుతూ.. నేటి యువత ఆజాద్‌ను స్ఫూర్తిగా తీసుకుని ఆయన ఆశయసాధనకు పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో సలీం, గోవర్ధన్‌రెడ్డి, మహేందర్‌గౌడ్, బాలకిషన్‌గౌడ్ పాల్గొన్నారు.

మక్తల్: మండల పరిధిలోని చంద్రశేఖర్ ఆజాద్ జయంతి సందర్భంగా పట్టణంలో వివేకానంద చౌరస్తాలో ఏబీవీపీ ఆధ్వర్యంలో ఆదివారం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు విడుదల చేయాలి

- నాట్లు వేసేందుకు కోయిల్‌సాగర్ ఆయకట్టు రైతులు సిద్ధం
- కుడి, ఎడమ కాల్వల మరమ్మతులు చేపట్టాలి



కేఎస్పీ ఆయకట్టు కింద నారుమళ్లను పరిశీలిస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి

మరికల్: సకాలంలో రైతులు వరినాట్లు వేసుకోవడం కోసం కోయిల్‌సాగర్ నీటిని విడుదల చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్ రెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద నారుమళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం కోయిల్‌సాగర్ ప్రాజెక్టు(కేఎస్పీ)లో భారీగా వరదనీరు వచ్చి చేరుతుందని, ఆయకట్టుకు నీళ్లు వదిలితే రైతులు నాట్లు వేసుకునే అవకాశం ఉందన్నారు. లేదంటే నారుమళ్లు ముదిరి పంటల దిగుబడి తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఈ విషయంపై నారాయణపేట, దేవరకద్ర ఎమ్మెల్యేలకు చిత్తశుద్ధి లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిచేసిన కోయిల్‌సాగర్ ఎత్తిపోత్తలకు జూరాల నీళ్లు వస్తే పూల్లుచల్లి పూజలు చేయడమే వారికి తెలుసని, రైతన్న కష్టాలు తెలియవని విమర్శించారు. కుడి, ఎడమ కాల్వల్లో ముళ్లకంప పెరిగి నీళ్లురాని పరిస్థితి ఏర్పడిందన్నారు. మరమ్మతులకు నోచుకోని తూములు, ముళ్లపొదల వల్ల చివరి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారని అన్నారు. అధికార పార్టీకి చెందిన నాయకులు మరికల్‌లో కోయిల్‌సాగర్ లింక్ కెనాల్ కాల్వలను మింగేస్తున్నా, ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు వీరన్న, కృష్ణయ్య, జనార్దన్‌రెడ్డి, వేణుగోపాల్, శివరాజ్, జగన్‌మోహన్‌రెడ్డి, జయసింహారెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, మొగులప్ప పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రేక్షకపాత్ర ఎందుకు?



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నర్వ: మండల పీఏసీఎస్‌లో రూ.3కోట్ల అవినీతి జరిగిందని సాక్షాత్తు ప్రస్తుత చైర్మన్, గత చైర్మన్ ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నప్పటికీ స్థానిక ఎమ్మెల్యే పట్టించుకోకుండా ప్రేక్షకపాత్ర వహించడం ఏమిటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప ప్రశ్నించారు. ఆదివారం సాయంత్రం వారు నర్వలో విలేకరులతో మాట్లాడారు. రైతులకు చెందాల్సిన డబ్బుల విషయంలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలని, ఎవరెవరికి ఎంతవాటా ఉందో తేల్చాలని డిమాండ్ చేశారు. అవినీతి ఆరోపణలు ఉండటం వల్లే గత చైర్మన్ లక్ష్మీకాంత్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టామని అన్నారు. అయినా బీఆర్ఎస్ నుంచి ఆయనను ఎందుకు సస్పెండ్ చేయడంలేదని అన్నారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటూ రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఈ అవినీతిపై అధికారులు, ఎమ్మెల్యే స్పందించి రైతులకు న్యాయం చేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందని, డబ్బు వసూలు చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ నీరజ, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు రాధమ్మ, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, సంజీవరెడ్డి, వెంకటేష్, రవిసాగర్, అయ్యపురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగాలి



మాట్లాడుతున్న సరాఫ్‌నాగరాజు

నారాయణపేట రూరల్ : పార్టీలకు అతీతంగా ముదిరాజ్‌లు రాజకీయంగా ఎదగడానికి ప్రతి ఒక్కరూ కలిసిరావాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సరాఫ్ నాగరాజు అన్నారు. ఆదివారం జిల్లాకార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.. రాష్ట్రంలో 17శాతం ముదిరాజ్‌ల జనాభా ఉన్నప్పటికీ రాజకీయాల్లో సరియైనా ప్రాతినిధ్యం లేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి 75ఏళ్లుగా కనీసం నామినేటె పోస్టుల్లో సైతం అవకాశం దక్కలేదన్నారు. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌ను ముదిరాజ్‌లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వెంకటయ్య, రాము, ఓంప్రకాష్, గురులింగం, వెంకట్రాములు, శ్రీనివాస్, లక్ష్మీకాంత్, కాకర్లభీమయ్య, మల్లేష్, సంజీవ్‌ప్రకాష్, పాండు, రాజేష్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూరు: ప్రభుత్వం భవన నిర్మాణకార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నప్ప కోరారు. ఆదివారం మండలంలోని అమీన్‌పూర్, ఓబులాపూర్, పగిడిమారి, ఒల్లంపల్లి గ్రామాల్లో సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చేనెల 4న హైదరాబాద్‌లో జరిగే బహిరంగ సభకు మండలం నుంచి కార్మికులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలం చెందుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కృష్ణయ్య, హన్మంతు, పగిడిమారి భీంరావు, మల్లేపల్లి కిష్టయ్య, వెంకటమ్మ, లక్ష్మీ పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



మాట్లాడుతున్న తిరుపతమ్మ

మరికల్: మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ. 19 వేలు ఇవ్వాలని కార్మిక సంఘం మండల అధ్యక్షురాలు తిరుపతమ్మ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పాఠశాల ఆవరణలో భోజన కార్మికుల సమావేశం ఏర్పాటుచేశారు. ఎన్నోఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులుగా పనిచేస్తున్న తమ సమస్యలను ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం భోజన కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వెంకటయ్య సమక్షంలో ఇతర భోజన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సత్యమ్మ, అనిత, ప్రధాన కార్యదర్శిగా పాతిమాబేగం, సహాయ కార్యదర్శులుగా రాజేశ్వరీ, కో–శాధికారిగా వెంకటేష్‌లతోపాటు 22మందిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బస్సు ప్లాట్‌ఫాంలో బైక్‌ల పార్కింగ్



నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆయా రూట్‌లకు వెళ్లే బస్సులు నిలిపే ప్లాట్‌ఫాంలో బైక్‌లు పార్కింగ్ చేస్తున్నారు. పేటతో పాటు వివిధ గ్రామాల నుంచి చాలామంది ద్విచక్ర వాహనాలపై బస్టాండ్ చేరుకుని బస్సులు ఎక్కుతుంటారు. వారి విధులు, ఇతర పనులు, వ్యాపారం పూర్తి చేసుకుని తిరిగి వచ్చేవరకు తమ వాహనాలను ప్లాట్‌ఫాంపై నిలుపుతున్నారు. దీని గురించి ఆర్టీసీ అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు.

రైతువేదికలో బీఆర్ఎస్ నిరసన



రైతువేదికలో మాట్లాడుతున్న భీమయ్యగౌడ్

దామరగిద్ద: సీఎం కేసీఆర్ నేతృత్వం నిరంతర విద్యుత్‌ను అందించి తెలంగాణలో వెలుగులు నింపడాన్ని జీర్ణించుకోలేనే పీసీసీ అధ్యక్షుడు రైతాంగానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందంటూ ఎద్దేవా చేస్తున్నారని జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు భీమయ్యగౌడ్, ఎంపీపీ నర్సప్ప అన్నారు. ఆదివారం మండలంలోని అన్నాసాగర్, లోకుర్తి క్లస్టర్ గ్రామాల్లోని రైతువేదికలో రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ రైతులతో కలిసిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదర్శవంతమైన పాలనను అందిస్తున్న బీఆర్ఎస్ ఎదగుదలను చూసి ఓర్వలేక కాంగ్రెస్ నాయకులు రైతువ్యతిరేక విధానాలను అవలంబించే పనిలో పడ్డారన్నారు. రైతుల జోలికి వస్తే తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో బసంత్‌రెడ్డి, సుదర్శన్, కొండప్ప, శ్రీనివాస్‌షెట్టి, సాయిలుగౌడ్, రైతులు పాల్గొన్నారు.

ఉప కులాలకు ఆరు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలి



మాట్లాడుతున్న నారా కొండయ్య

మరికల్: ఎస్సీ ఉపకులాలకు రాజకీయపార్టీలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆరుస్థానాలను కేటాయించాలని ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారా కొండయ్య అన్నారు. ఆదివారం మండలంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దళితబంధు పథకంలో 40శాతం కేటాయించాలని, కుల ధృవీకరణ పత్రాలు ఆర్డీఓతో కాకుండా తహసీల్దార్ ద్వారా జారీచేయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 22లక్షల జనాభా ఉన్న దళితులల్లో 34శాతం ఉన్న 57ఉపకులాలు స్వాతంత్రం వచ్చి 75సంవత్సరాలు గడుస్తున్నా రాజ్యాధికారం పొందలేదన్నారు. ఎస్సీ ఉపకులాలకు న్యాయం జరిగే వరకు తమపోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో మల్లేష్, తిరుపతయ్య, అశోక్, కృష్ణ చైతన్య, కొండన్న, శ్రీనివాసులు, రవి, రాములు, శివకుమార్ పాల్గొన్నారు.

మండలం ఏర్పాటు చేసేవరకు దీక్షలు



కోటకొండలో దీక్షలో సాధనసమితి సభ్యులు

నారాయణపేట రూరల్: కోటకొండను మండలం ఏర్పాటుచేసే వరకు దీక్షలు కొనసాగుతాయని సాధనసమితి సభ్యులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కోటకొండను మండలం చేయాలని కొనసాగుతున్న దీక్షలు ఆదివారంతో 75వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రాజకీయ దురుద్దేశంతో కోటకొండను మండలంగా ప్రకటించడంలేదని విమర్శించారు. అన్నిఅర్హతలు ఉన్నా ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారో ఎమ్మెల్యే సమాధానం చెప్పాలన్నారు. నియోజకవర్గంలో మూడుప్రాంతాలను మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదప్ప, చెన్నప్ప, ప్రవీణ్, దస్తప్ప, రాములు, బాలప్ప, రామకృష్ణ, రాజవర్ధన్, కిష్టప్ప, లక్ష్మయ్య, మాసప్ప, వెంకటయ్య, నాగప్ప పాల్గొన్నారు.

ఆవును ఢీకొన్న బైక్ : ఇద్దరికి గాయాలు

మక్తల్: రోడ్డుపై వెళ్తున్న ఆవును బైక్ వస్తూ ఢీకొట్టి కిందపడడంతో ఇద్దరికి గాయాలైన ఘటన ఆదివారం మండలంలోని బొందల్‌కుంటలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. ఊట్కూర్ మండలం బిజ్వార్‌కు చెందిన బాలక్రిష్ణ మక్తల్‌లో వెంకటేశ్వర హోటల్‌లో పని చేస్తున్నాడు. ఆదివారం రాత్రి హోటల్‌లో పని ముగించుకొని బిజ్వార్‌కు బైక్ బయలుదేరగా బొందల్‌కుంట స్టేజీ వద్ద ఆవును ఢీ కొట్టాడు. దీంతో బైక్ కిందపడి అతనికి గాయాలుకాగా, ఆవును పట్టుకొస్తున్న కృష్ణయ్యకు గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో వారు మక్తల్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. బాలక్రిష్ణ తలకు బలమైన గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.